




పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు:నగర పాలక సంస్థ పరిధిలో బారాషాహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువు ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మేయర్ స్రవంతి జయవర్ధన్ పరిశీలించారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలతో కలిసి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ ముస్లిం మత పెద్దలు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని దర్గామిట్ట బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క ఎక్కువగా చేరుకొని అపరిశుభ్రంగా ఉందన్నారు. స్వర్ణాల చెరువును పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఇటీవల తనకు వినతిపత్రం అందజేసి కోరారు. ఘాట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న మేయర్

గౌతంరెడ్డి ఆశయాలను పూర్తి చేస్తాం


..ట్రస్టు ద్వారా రూ.10కోట్లు కేటాయింపు
..రూ.4.50కోట్లతో ఆత్మకూరు బస్టాండు
..మాజీ ఎంపి రాజమోహన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాజీమంత్రి కీర్తిశేషులు మేకపాటి గౌతంరెడ్డి ఆశయాలను పూర్తి చేస్తామనిమాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డిలు అన్నారు. గౌతంరెడ్డి ఆశయ సాధన కోసం నియోజక వర్గంలో రూ.10కోట్లు ఖర్చు పెడుతున్నామని, అందులో భాగంగా రూ.4.50కోట్లు ఆత్మకూరు బస్టాండు నిర్మించారు. మరో మూడు బస్టాండులు అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఎంజిఆర్ ఫౌండేషన్ ఎడిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మకూరు నడిబొ డ్డున 4.50 కోట్లతో కీర్తి శేషులు మంత్రి మేకపాటి గౌతంరెడ్డి స్మారకంగా నిర్మించిన అధునాతన బస్టాండ్ సముదాయాన్ని రాజమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, రాజ్యసభ సభ్యులు, ఎంపిలు, జెడిపి చైర్మన్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు తమ కుటుంబం ప్రజలకు సేవ చేసేామే తప్ప ఎలాంటి తలవంపులు తెచ్చే పనిని ఎప్పటికి చేయమని అది ప్రజలు గమనించాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచే జగన్మోహన్ రెడ్డికి అండగా తమ కుటుంబం నిలిచిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి


బస్టాండ్ ప్రారంభానికి తరలొచ్చిన ప్రజలు

తన కుమారుడు కీర్తిశేషులు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన ఆకాల మరణం తమను బాధిస్తుందన్నారు. ఆయన ఆశలు, ఆశయ సాధనకు తన కుమారుడు విక్రమ్ రెడ్డి పట్టు వీడని విక్రమార్కుడిలా కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సొంత నిధులతో పాటు ఎడిఎఫ్ ఏర్పాటు చేసి ఆ నిధుల నుంచి రూ.4.50కోట్లు అధునాతనంగా ప్రజల సౌకర్యార్థం ఆత్మకూరులో బస్టాండ్ నిర్మించారని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజలకు సాగు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఓ బహిరంగ ప్రణాళిక ద్వారా చేయనున్నట్లు తెలిపారు. ఏ విధంగా విద్య, వైద్యం ప్రజలందరికీ అందించేందుకు ఎంఎల్‌ఎ విక్రమ్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో కూడా సొంతంగా ప్రభుత్వ పరంగా నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు ప్రజల సొమ్ము ఒక రూపాయి కూడా తాము తాకమని, తలవొంపులు తెచ్చే పని చేయబోమన్నారు. కొందరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం కల్లబొల్లి


బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మాటలు చెబుతున్నారని, నేను.. నా పిల్లలు ఎలాంటి వారో నియోజక వర్గ, జిల్లా ప్రజలకు తెలుసు అన్నారు తమ చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తులు కొన్ని పత్రికలను అడ్డం పెట్టుకొని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎంతో తెలివైన ఆత్మకూరు ప్రాంత ప్రజలు వారి కల్లబొల్లి మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు.

సభాధ్యక్షులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ అన్న ఆశయ సాధనకు అహర్నిశలు కృషి చేస్తానని ఆత్మకూర్ నియోజకవర్గ రూపురేఖలు మార్చి నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

ఈ ప్రాంత ప్రజలు వారి దీవెనలను అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అండదండలతో ఆత్మకూరు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. తమపై ఉన్న నమ్మకంతో నియోజకవర్గంలోని ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి తమపై చూపిన అభిమానానికి కతజ్ఞతలు తెలిపారు. జెడ్‌పి చైర్మన్ అరుణమ్మ మాట్లాడుతూ మాజీ మంత్రి కీర్తిశేషులు మేకపాటి గౌతమ్ రెడ్డి ఆశయాలను ఎమ్మెల్యే గౌతంరెడ్డి నెరవేర్చారన్నారు. ఎంజిఆర్ ఫౌండేషన్ ద్వారా అధునాతన బస్టాండ్ నిర్మించడం అభినందనీయమన్నారు. జిల్లాకే ఈ బస్టాండ్ తలమానికమన్నారు. గౌతమ్ రెడ్డి మనతోనే మన మధ్యనే ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మేకపాటి గౌతంరెడ్డి పేరుతో అధునాతన బస్టాండ్ నిర్మించడం సంతోషమన్నారు. గౌతమ్ రెడ్డి ఎంత ఉన్నతమైన వ్యక్తి అని ఆయన లేని లోటు పూడ్చ లేనిదన్నారు. ఆత్మకూరు అభివృద్ధి కోసం విక్రమ్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ మేకపాటి గౌతంరెడ్డి ఆశయ సాధనకు ఆయన కుటుంబం విశేష కృషి చేయడం అభినందనీయమన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మాట్లాడుతూ జిల్లాలో గత పూర్వవైభవం మళ్లీ వస్తుందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఈ అభివృద్ధి కొనసాగందుకు ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్యేలు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యల నివారణలో భాగంగా పట్టణంలోని టి.ఆర్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం, రవాణా చేయడం, చట్ట రీత్యా నేరమన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండి మాదకద్రవ్యలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారు చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. అధ్యాపకులు నిరంతరం విద్యార్థులను గమనిస్తూ మంచి అలవాట్ల వైపు మార్గ నిర్దేశం చేయాలనీ తెలిపారు. తమ పరిధిలోకి వచ్చే నేరాల గురించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కి తమ ఫిర్యాదులను ఇవ్వొచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఐ. డి.మౌలాలి, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.సుబ్బారావు, అధ్యా పకులు ఓ. వెంకటేశ్వర రావు, సి హెచ్. శ్రీని వాసులు, పి. ఉష, కాస్టేబుళ్లు ఎస్. కె పోలీస్ బాషా. బి.వి. సుబ్బయ్య లు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కుష్టు నివారణపై సర్వే

ప్రజాశక్తి -గుడ్లూరు:కుష్టు వ్యాధి నివారణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు లెప్రసీ వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కుష్టు నివారణ పై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. కుష్టు నిర్మూలనలో భాగంగా ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి రాగి మచ్చలు ఉన్నవారిని స్పర్శ లేని మచ్చలు ఉన్న గుర్తించి వారి పేర్లను నమోదు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ భాస్కరరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కరోనా అనంతరం ఆటో కార్మికులు బాడుగులు లేక ఆటోలో కిస్తీలు కట్టలేక కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు ఎంవి రాజా అధ్యక్షత వహించారు. వర్క్‌షాపులో 16 మండలాల నుంచి ఆటో కార్మిక సంఘం ప్రతినిధులు హాజరయ్యారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్ కుమార్‌లు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు ఈ చలానాలు అట్లాగే ఆర్టిఏ అధికారుల అధిక జరిమానాలు చలానా ఫీజులు వీటివల్ల ఆర్థికంగా ఆటో కార్మికులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం అనుసరిస్తూనేటటువంటి ఈ ట్రాన్స్‌పోర్టు కార్మికుల వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలంటే రంగంలో ఉండేటటువంటి కార్మికులందరూ ఐకమత్యంగా ఉండి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. అంతేకాకుండా రవాణా రంగంలో ఉండేటటువంటి కార్మిక వర్గానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సవరించిన మోటారు చట్టంలో ఉండేటటువంటి కార్మిక వ్యతిరేక విధానాలకు సంబంధించినటువంటి అంశాలను తొలగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ఆటో కార్మిక సంఘం గడిచిన 20 సంవత్సరాలు కాలంలో కార్మికుల ఆర్థిక ఇబ్బందులను పరిష్కరిం చడంతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తూ ఉందన్నారు. అంతే కాకుండా రాబోవు రోజుల్లో రవాణా రంగంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని వాటికి సంబంధించినటువంటి భవిష్యత్తు పోరాటాలకు ఆటో కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా నాయకులు పి నాగూర్, ఎం.సుధాకర్, సిహెచ్ వెంగయ్య, కె.వెంకయ్య , పి మురళి, మండలాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్

ధాన్యం మద్దతు ధర పెంచాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో మండల రైతు సంఘం కమిటీ సమావేశం జరిగింది.ఆకుల వెంకట కష్ణ అధ్యక్షతన, సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు పండించేందుకు అవసరమైన ఉత్పత్తి ఖర్చులతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపు చర్య అన్నారు. క్వింటాల్ ధాన్యం పండించేందుకు రైతుకు మూడు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం క్వింటాల్ ధాన్యానికి మద్దతు ధర కింద రూ.2183 గా ప్రకటించడం రైతులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం స్వామినాధన్ కమిషన్ ప్రకారం ధాన్యం ధరలు నిర్ణయిం చాలని కోరారు. వ్యవసాయ పంపు సెట్లకు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని సూచించారు. అదే విధంగా ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి శంకరయ్య, సిపిఎం నాయకులు వి.వెంకయ్య, ఎం. రాజా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షులు శ్రీరాములు

ముస్లిముల జోలికొస్తే ఊరుకోం

ప్రజాశక్తి-నెల్లూరుఇ:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో మాట్లాడుతూ తాను బిజెపితో కలిసి ప్రయాణం చేస్తున్నాని, బిజెపి తన మిత్రపక్షమని ముస్లిములు తనతో కలిసి ప్రయాణం చేయకపోతే నష్టపోతారని చెప్పడం హాస్యాస్పందంగా ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం అజాద్ సెంటర్ లోనీ ఇన్సాఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చూస్తున్నారన్నారు. జనసేన పవన్ కళ్యాణ్‌కి ఏమైనా రాజకీయ జ్ఞానం ఉందా మన రాష్ట్రంలో ఆయనకే దిక్కులేదని, గత ఎన్నికల్లో రెండు చోట్ల ఓడిపోయిన మహానుభావుడని, టిడిపి, బిజెపిలతో కలిసి ప్రయాణం చేస్తారా.. లేక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తారో నేటికీ స్పష్టత లేదన్నారు. రాజకీయాల్లోకి రావడమా.. లేకుంటే సినిమాలు తీసుకోవడమా ముందు తేల్చుకోవాలన్నారు. ముస్లిముల జోలికొస్తే తగిన బుద్ధి చెప్తావని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వారాహి యాత్ర ద్వారా ముస్లిం సమాజానికి క్షమాపణలు చెప్పాలి లేదంటే ప్రజాగ్రహానికి గురవుతారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, గోపాల్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

కెపిసి జూనియర్ కళాశాలలో కనీస వసతులు కరువు

ప్రజాశక్తి-నెల్లూరు:నగరంలోని కెపిసి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువైపోయాయని, వారికి బాత్‌రూం సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ పేర్కొంది. శుక్రవారం ప్రభుత్వ కళాశాలల సర్వేలో భాగంగా నగరంలోని కేపీసీ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి వి.నరేంద్ర విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో తమకు మౌలిక వసతులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ కార్యదర్శి వి .నరేంద్ర మాట్లాడుతూ కళాశాలలో చదువుకునే విద్యార్థులు కళాశాలలో వాష్ రూమ్ సరిలేకపోవడం దారుణమన్నారు. గతంలో కళాశాలలో మిడ్ డే మీల్ ఏర్పాటు చేసేవారు కానీ ప్రస్తుతం దానిని రుద్దు చేయడంతో దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులు భోజనం లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం పాలనలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు పలు రూపాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొనే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తుండేదని, ప్రస్తుతం అధికారంలోని ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేది లేదని విద్యార్థులు తమ సొంత ఖర్చులతో పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలని ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ నాయకులు ప్రవీణ్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

651మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి-వెంకటాచలం:విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలో మొత్తం 5432 మంది విద్యార్థులు గాను 5130 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు 302 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మాస్కులను తప్పనిసరి చేస్తూ భౌతిక దూరం పాటిస్తూ పరీక్షలు నిర్వహించడం జరిగిందని పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-కందుకూరు: డివిజన్ లోని ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ఏ పాఠశాలకైనా ప్రభుత్వ అనుమతి కాలం ముగిసిన వెంటనే రెన్యూవల్‌కు అనుమతి, గుర్తింపునకు ప్రతిపాదనలు పంపించుకోవాలని ఉప విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయంలో ఐదు మండలాల ఎంఈఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా అనుమతి, గుర్తింపు కావలసిన వారు జిల్లా విద్యాశాఖకు ప్రతిపాదనలు వెంటనే పంపించుకోవాలన్నారు. ప్రతి పాఠశాలకూ నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ అనుమతి , గుర్తింపు తప్పనిసరని తెలిపారు. అనుమతి, గుర్తింపు లేకుండా ఏ పాఠశాల నడపకూడదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం కేటాయించిన ఫీజులు మాత్రమే విద్యార్థుల నుంచి వసూలు చేయాలని, పాఠశాల ఆవరణలో ఫీజుల వివరాలు ఫ్లెక్స్ ద్వారా డిస్ప్లే చేయాలని ఐదు మండలాల విద్యాశాఖాధికారులు తెలిపారు.



ఎంఇఒ'కూనం'కు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :ఇటీవల జరిగిన ఉద్యోగోన్నతులలో కందుకూరు ఎంఇఒ2 గా బాధ్యతలు స్వీకరించిన కూనం.సుబ్బారెడ్డిని శుక్రవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ వారు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ 1, ఎంఇఒ-2 లను సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా బిటిఎ మండల శాఖ అధ్యక్షులు ఎం. రమణయ్య మాట్లాడుతూ మండలం లోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.అనంతరం ఎంఇఒ వెంకటేశ్వర నాయక్ , సుబ్బారెడ్డి ఈ కార్యక్రమంలోబి టి ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె మోహన్ రావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీ ఎస్ మహేంద్ర, మండల అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, శ్రీను, జిల్లా నాయకులు కె.ఎల్లమంద , కొండలరావు , సూర్యనారాయణ పిడి అసోసియేషన్ తరపున ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

ఆర్థికసాయం అందజేత


ప్రజాశక్తి-కందుకూరు: ఉలవపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ రావినూతల కనకారావు ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో వస్తువులు, నగదు కాలి బూడిదయ్యాయి.కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు కనకారావును పరామర్శించి, అగ్ని ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం శుక్రవారం అందిం చారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు అంచుపోగు వాసు, ఎంపీటీసీ దార్ల యలమందమ్మ, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి చింతల సింగయ్య, మండల తెలుగు యువత అధ్యక్షుడు తొట్టెంపూడి మాల్యాద్రి,పలువురు నాయకులు కనకారావును పరామర్శించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఇంటూరి


మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

26న బస్సు యాత్రపై చర్చ

ప్రజాశక్తి-కందుకూరు:తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించడంలో భాగంగా ఈనెల 26వ తేదీన కందుకూరు నియోజకవర్గంలో జరగనున్న బస్సుయాత్రపై చర్చించేందుకు స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమావేశం నిర్వహిం చారు.. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, పలువురు రాష్ట్ర కమిటీ నాయకులు హాజరై నాగేశ్వరావుతో చర్చించారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్య క్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజక వర్గ, పట్టణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దాత

దేవస్థానానికి విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు:శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం పునర్నిర్మాణంకు కందుకూరు శాసనసభ సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి , భక్తులు కలిసి పునర్నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో యెనిమిరెడ్డి వెంకటరెడ్డి , అంకమ్మ తల్లి దేవస్థానం పునర్నిర్మాణం సహకరించిన ప్రతి భక్తుడికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా 1975-76 పదవ తరగతి జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాల కందుకూరు బ్యాచ్ పునర్నిర్మాణంకు శుక్రవారం కందుకూరు అంకమ్మ తల్లి దేవస్థానం నందు.రూ.2000 రంగారావు సాయి నగర్ వారిచే అందించడం జరిగింది. కార్యక్రమంలో కొడాలి కోటేశ్వం రావు. మాదాల మాల్యాద్రి తదితరులు పాల్గొ న్నారు.

భూగర్భ డ్రెయినేజీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

పాకీ పనులకేనా?, పర్మినెంట్ కి మేము అనర్హులమా?, ఎన్నికల ప్రచార సమయంలో, పాదయాత్రలు చేసే సమయంలో తమకు చేసిన వాగ్దానాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి ఎందుకు అమలు చేయరో తేల్చి చెప్పాలంటూ భూగర్భ జల డ్రెయినేజీ కార్మికులు పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం ఈ ధర్నా కార్యక్రమం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రభుత్వానికి తగదన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు భూగర్భ డ్రెయినేజీ సౌకర్యం కల్పించడం కోసం మలమూత్రాలు ప్రవహించే భూగర్భ డ్రెయినేజీ సరఫరా స్తంభించిన సందర్భంలో మాన్యు హోల్స్ లోకి దిగి వాటిలో మునిగి తేలుతూ కార్మికులు పనిచేస్తారన్నారు. వాటిలోని విషవాయువులను పీల్చి అనేక సందర్భాలలో అస్వస్థకు గురై ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి కూడా ఉందన్నారు. నిరంతరం అనారోగ్యాలతో, చాలీచాలని జీతాలతో, అప్పులతో భూగర్భ డ్రెయినేజీ కార్మికులు బతుకులీడిస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ అధికారంలోకి వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తానని చేసిన వాగ్దానాన్ని ఇంతవరకు అమలు చేయకపోవడం సరైన చర్య కాదన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర కార్యదర్శి ఎం.అశోక్, భూగర్భ డ్రెయినేజీ యూనియన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, షేక్ షబ్బీర్, నాయకులు దయాకర్, మరియన్న, కందా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు


సంక్షేమమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందాలన్నదే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని ఎంపీడీఓ కన్నం హేమలత పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధికారులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ముఖ్య మంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హేమలత మాట్లాడుతూ మండలంలో నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వాలంటీర్లు, గహ సారధులు ఇంటింటికీ తిరిగి అర్హ త ఉండి ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు అందక పొరపాటున మిగిలిన వారికి తలుపు తట్టి పథకాలు అందించాలని తెలిపారు. అవ సరమైన పౌరసేవలను అందిం చడానికి సంబంధిత సచివాలయంలో ఎప్పటికప్పుడు టోకెన్ జనరేట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ టోకెన్ మేరకు లబ్ధిదారుల కు జూలై 1 నుంచి జరిగే జగన న్న సురక్ష సమావేశాలలో సమయం సూచించి అర్హతగల పత్రాలను అందించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సూ చించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ

పిల్లలకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-పొదలకూరు:కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలతో మండలంలోని మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార లోపం, ఎదుగుదల లేని పిల్లలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వెన్నెల పీడియాట్రీషియన్ ఎదుగుదల, పోషకాహార లోపం పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహించారు.105 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఎనిమిది మంది విద్యార్థులను నెల్లూరులోని ఎన్‌ఆర్సీ న్యూట్రిషన్ రిహబిటేషన్ సెంటర్‌కు పంపించినట్లు తెలిపారు.ప్రతీ శుక్రవారం పోషకాహారం, ఎదుగుదల లేని పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నరసింహారావు, కావ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి ప్రోత్సాహం అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ప్రతిభకు ప్రోత్సాహం అభినందనీయం

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల ప్రతిభను ప్రభుత్వం – ప్రోత్సహించడం అభినందనీయమని వైసిపి నేత చక్కా మనోహర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని కొత్తవంగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పది ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి ఆణిముత్యాలుగా నిలిచిన దేవళ్ల సింధు, పగడాల విష్ణు, తాటిచెట్ల భానుతేజలను ఆ పాఠశాలలో శుక్రవారం సత్కరించి నగదు పురస్కారం, ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం గుర్తించి ఆణిముత్యాలు పేరుతో సత్కరించడం ప్రశంసనీయమన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విద్యలో రాణించేందుకు దోహదపడుతుందన్నారు. పాఠశాలలో 72 శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణకుమార్, విద్యా కమిటీ చైర్మన్ చక్కా వంశీ, ఎంపిటిసి సంబారి ప్రసాద్, నాయకులు కొనిజేటి శేషగిరిరావు, గంధం సురేష్, వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



'సంయుక్త' ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు సాఫ్ట్‌వేర్ ఒట్టూరు. సుధాకర్ – చిత్ర కల్పన దంపతుల కుమారుడు వృత్తి రీత్యా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఒట్టూరు.సుచిత్ 24వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వెంగళరావు నగర్లో సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఒట్టూరు.సుచిత్ తాతయ్య, అమ్మమ్మ ఆత్మకూరు కల్లయ్య–విజయలక్ష్మి, అమ్మ చిత్రకల్పన, సంయుక్త సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, ఉపాధ్యక్షులు గంధం ప్రసన్నాంజ నేయులు, సంస్థగౌరవసభ్యులు ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుచిత్ తాతయ్య ఆత్మకూరు కల్లయ్య మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లల మధ్య తన మనవడు పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ బెజవాడ రవికుమార్, గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ ఒట్టూరు సుధాకర్, వారి అన్నదమ్ములు ఎంతో కష్టపడి చదువుకొని ఉన్నత స్థితికి చేరుకున్నారని తెలిపారు. వారిలాగే వారి పిల్లలు కూడా మంచి చదువులు చదివి అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

'జగనన్న సురక్ష'తో ప్రయోజనం

ప్రజాశక్తి-కొడవలూరు



జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ ప్రయోజనకరంగా మారనుందని వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య స్పష్టం చేశారు. మండలంలోని గుండాలమ్మపాలెం ఆర్‌బికెలో ముఖ్యమంత్రి జగన్మోహనోరెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. జనన, మరణ ధృవీకరణలతోపాటు రేషన్ కార్డు, కరెంట్ బిల్లు పేరు మార్పు తదితర సమస్యలతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీరందరి సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. సచివాలయ కన్వీనర్లు నాగేంద్ర, ప్రసాద్‌రెడ్డి, మధుసూధనావు, విఎఎ విష్ణుప్రియ, డిజిటల్ వెల్ఫేర్ సహాయకులు రాజేష్, ఒసామా, నాయకుడు పానేటి శీనయ్య పాల్గొన్నారు.

బిసిల ద్రోహి సిఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



బిసిల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పొన్ని బోయిన చెంచుకుషోర్ పేర్కొ న్నారు. శుక్రవారం మండలంలోని టిడిపి కార్యాలయంలో బిసి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో బిసిలకు పెద్దపీట వేస్తూ అనేక అవకాశాలు కల్పించారని, వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం వాటిలిందన్నారు. బిసి సబ్‌ప్లాన్ నిధులను సంక్షేమాలకు తరలించి జగన్మోహన్ రెడ్డి బిసిలకు నమ్మక ద్రోహం చేశారన్నారు. ప్రశ్నిస్తే బిసిలపై కేసులు పెడతారని ప్రశ్నించారు. ఇకనైనా బిసిలు మేల్కొని రాబోయే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంపల అనిల్, మైనార్టీనేత ఎస్‌కె ఇంతియాజ్, గుండాల సుధీర్, మధుబాబు, తదితరులున్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పొదలకూరు

మండలంలోని పులికల్లు గ్రామ పంచాయతీలో సర్పంచ్ జివి సుబ్బమ్మ అధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంపిపి స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాధవి మాట్లాడుతూ యోగా విశిష్టతను, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. యోగాతో ఆరోగ్యకర జీవన విధానంను అలవర్చుకోవాలని, విద్యార్థుల్లో ఏకాగ్రతను, చురుకుదనాన్ని పెంపొందిస్తుందన్నారు.యోగా నిత్యం సాధన చేస్తే ఉన్నత ర్యాంకులు సాధించి, అఖిల భారత సర్వీసులు సాధించొచ్చని పిల్లల్లో ఉత్సుకతను నింపారు. వారితో మెడిటేషన్, వారియర్ ఆసనం, వక్షాసనం ప్రాక్టీస్ చేయించారు. సర్పంచ్ వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని, శరీర దఢత్వాన్ని పెంచుతుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం. జనార్ధన్ మాట్లాడు యోగా ప్రాక్టీస్ చేస్తే శరీరానికి పూర్తి ఆక్సిజన్ అందించి అనారోగ్యాలు దూరం చేస్తుందన్నారు. అనంతరం యోగా పై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు పెంచల రెడ్డి, నారాయణ రెడ్డి, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

విజయవాడ ఆర్‌టిసి బస్సు బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికీ గాయాలైన సంఘటన మండలంలోని గువ్వాడి సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాలెం మండలం పంచేడుకు చెందిన కొండా సుధాకర్, ప్రణయ్ కుమార్, బైకుపై గండిపాలెం చదువుతున్న బిడ్డ వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా విజయవాడ నుంచి ఉదయగిరి ఆర్‌టిసి డిపోకు చెందిన విజయవాడ నుంచి ఉదయగిరికి వెళు తున్న బస్సు గువాడి సమీపములోని టర్నింగ్ వద్ద ఢీ కొన్నాయి. బైక్ పై ప్రయాణిస్తున్న కొండా సుధాకర్‌కు కాలు విరగగా, ప్రణయ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో వింజమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రావెల్ తరలింపు ఆపేంతవరకూ పోరాటం

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గంలో అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్ ఆపేంత వరకు నిద్ర పోయేదిలేదని, అధికారులు స్పందించక పోతే టిడిపి కార్యకర్తలతో వచ్చి, పోరాటం చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో కావలి పట్టణ, రూరల్ మండల టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహశీల్దారు మాధవరెడ్డి సిఎం సెట్ కాన్ఫరెన్స్‌లో ఉండి, కార్యాలయంలో లేకుండా పోయారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ జూలియాబాయి వచ్చి, టిడిపి అభ్యర్థన ఏమిటో తనకు వినతిపత్రం ఇస్తే, తాను వారి విన్నపాన్ని తహశీల్దారుకు తెలియజేస్తానన్నారు. అందుకు టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దారు వచ్చే వరకు కార్యాలయాన్ని విడిచి వెళ్లేది లేదన్నారు. గ్రావెల్ మాఫియాను అరెస్టు చేయాలి.. రెవెన్యూ అధికారులకు


తహశీల్దారుతో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

వాటా.. అవినీతిలో ఎవరి వాటా ఎంత.. సిఎం డౌన్‌డౌన్.. ఎంఎల్‌ఎ డౌన్‌డౌన్.. అంటూ టిడిపి శ్రేణుల నినాదాలతో తహశీల్దార్ కార్యాలయం మారుమోగింది. ఎంతసేపైనా తహశీల్దార్ రాకపోవడంతో.. పోలీసులు మోహరించడంతో.. కావలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వంటావార్పు కార్యక్రమం చేపట్టి, కార్యాలయ ఆవరణంలోనే మాలేపాటితో టిడిపి నాయకులు, కార్యకర్తలు తాము వండి, వార్చుకున్న భోజనాలు పూర్తి చేశారు. తహశీల్దార్‌కు మాత్రమే ఆర్జీని సమర్పిస్తానని, మాలేపాటి మొండిపట్టు పట్టారు. చివరికి తహశీల్దార్ మాధవరెడ్డి కార్యాలయానికి వచ్చారు. సమస్యను క్షుణ్ణంగా తహశీల్దార్‌కి మాలేపాటి తెలియజేశారు. గ్రావెల్ మాఫియాను అవకాశంగా మల్చేస్తే తమ కార్యాలయానికి వచ్చి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రావెల్ విషయంపై అధికారులందరిని కలవడం జరిగిందని, మీరైనా తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జ్యోతి బాబురావు, గుత్తికొండ కిషోర్ బాబు, ఆత్మకూరు నాగరాజు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, ఉప్పాల శ్రీను, అన్నపూర్ణ శ్రీను, అమరావతి జ్యోతి, పట్టణ, రూరల్ నాయకులు పాల్గొన్నారు.


తహశీల్దారుతో మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలో 67వ నెంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం బహిరంగ మార్కెట్ విలువపై నాలుగు రెట్లు కలిపి నష్టపరిహారాన్ని రైతులకు చెల్లించాలని ఆయన తహశీల్దార్‌ను కోరారు. భూనిర్వాసితులకు సంబంధించి పలు విషయాలను తహశీల్దార్‌కు వివరించారు. ఆయనవెంట నిర్వాసిత రైతులు సాధిక్ భాషా, ఎస్.కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చిలకపాడు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం డిప్యూటీ డిఇఒ పరిశీలించారు. ఆటస్థలం మంజూరు నిమిత్తం గ్రామస్తులు విజ్ఞప్తులు సమర్పించిన నేపథ్యంలో కావలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి హరిప్రసాద్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆటస్థలం కోసం గ్రామస్తులు సూచించిన స్థలాన్ని, పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మర్రిపాడు ఎంఇఒ–2 ధనలక్ష్మి, చిలకపాడు సర్పంచ్ సిద్ధంరెడ్డి రమా మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కరటంపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలకొండ రావు, ఎమ్మార్జీ రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-వరికుంటపాడు



గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, సకాలంలో వైద్యపరీక్షలు చేయించు కుంటూ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని రిటైర్డ్ డి ఎంహెచ్‌ఒ డాక్టర్ మాశిలామణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులలో వయసు ఎత్తుకు తగిన బరువులేని 114 మంది చిన్నారులను గుర్తించినట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య అధికారిని కరిష్మా, ఐసిడిఎస్ సిడిపిఒ పి.లావణ్య పర్యవేక్షకులు శాను, కళావతి, తేజస్విని, సిహెచ్‌ఒ రాజశేఖర్, పిహెచ్‌ఎన్ సుశీలమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జెజెఎం పథకం ద్వారా తెల్లగుంటకు నీరు

ప్రజాశక్తి-బిట్రగుంట

జల జీవన్ మిషన్ పథకం ద్వారా తెల్లగుంట గ్రామానికి శాశ్వత నీటి సరఫరాను అందిస్తున్నట్లు ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లిమడుగు గ్రామపంచాయతీ తెల్లగుంట గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా తాగు నీటి పైప్ లైన్‌కు శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తెల్లగుంట గ్రామంలో నీరు లేక చాలా సమస్యలు ఎదుర్కొన్నారని, జెజెఎం ద్వారా రూ.33 లక్షలు, ఎంఎల్‌ఎ నిధుల ద్వారా రూ.3 లక్షలతో శాశ్వత నీటి పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. మండలంలో రెండో కారుకు నీటిని అందించేందుకు జిల్లా నీటి అధికారులతో మాట్లాడి ప్రతిఒక్క రైతుకు నీరందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండలం కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, మేకల శ్రీనివాసులు, గండూరి శ్రీను, పెండ్లి వెంకటేశ్వర్లు, తోటపల్లి సాగర్, షమీవుల్లా, ఏకే సుందర్ రాజ్, నాయబ్ రసూల్, ఉమామేశ్వరపురం సర్పంచ్ సావిత్రి, సీనియర్ నాయకులు, టి.పెంచలయ్య, తుమ్మల రమణయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


అంధకారంలో రాయపేట గ్రామం

రాయపేటలో వెలగని వీధి దీపాలు

ప్రజాశక్తి-అల్లూరు

నగర పంచాయతీ పరిధిలోని రాయపేట గ్రామంలో గత కొద్ది రోజుల నుండి విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంత వాసులు అంధకారంలో కాలం గడుపుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ పొలాలు, తోటలు ఉన్నందున రాత్రి సమయాలలో విష సర్పాలు సంచరిస్తున్నాయని తెలియజేశారు. ఈ కారణంగా గ్రామంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని వారంటున్నారు. ఇకనైనా నగర పంచాయతీ అధికారులు సత్వరమే స్పందించి విద్యుత్ దీపాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నామన్నారు.

అన్నవరంలో 'ఆరోగ్య రథం' సేవలు

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని అన్నవరం గ్రామంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవని ఆరోగ్య రథం ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్, ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల సురేష్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యం కోసం నిరీక్షిస్తున్న అక్కడ అవ్వ– తాతలతో మాటామంతి కలిపారు. జనరల్, కంటికి సంబంధించిన అవసరమైన శస్త్ర చికిత్సలను కూడా సమస్త ద్వారా సేపిస్తానని అక్కడ ఉన్నవారందరికీ భరోసా కల్పించారు. గ్రామానికి చెందిన కంచి కృష్ణారెడ్డి అక్కడ నీడ, నీరు, భోజనం వసతి ఏర్పాటు చేశారు. 151 మంది సాధారణ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. 122 మందికి కంటికి సంబంధించిన చికిత్స తీసుకున్నారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం అనంతరం కాకర్ల సురేష్ ప్రధాన గ్రామంతో పాటు ఎస్‌సి, మైనారిటీ కాలనీలలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురిని


వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

పరామర్శించారు. వారికి నగదు సహాయాన్ని కూడా అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల సురేష్ తమ్ముడు సునీల్, తలపనేని మధుసూదన్ రావు, కొల్లా రాధాకృష్ణ, గంటా అశోక్, మధుసూదన్ రెడ్డి, బ్రాహ్మణక్రాక, వేలమూరి ఉమామహేశ్వర రెడ్డి, గుణపాటి వెంకటరమణారెడ్డి, రామినేని శేషయ్య, అంబటి హరిప్రసాద్ నాయుడు, కాసు చెంచు నాయుడు, ముప్వ శ్రీహరి, పరిమి శ్రీహరి నాయుడు, తమ్మినేని మహేశ్వరరావు, కాకర్ల ట్రస్ట్ సభ్యులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థులకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం స్థానిక రోడ్డు రవాణా సంస్థ డిఎం శ్రీనివాసరావు సిపిఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలలు ప్రారంభమై పది రోజులు అవుతున్న ఆర్‌టిసి ఆధ్వర్యంలో విద్యార్థులు బస్సులు ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే గ్రామాలకు చెందిన విద్యార్థులకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. విద్యార్థులు ఎక్కడ చేయవేత్తగా అక్కడే


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బస్సులు ఆపి వారి గమ్యాలకు చేర్చాలన్నారు. సిపిఎం, రైతు నాయకులు కాకు వెంకటయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సురేష్, ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ నాయబ్ రసూల్, వెంకటయ్య, మస్తాన్ రెడ్డి, నాగరాజు, రమణయ్య పాల్గొన్నారు.

'గడపగడపకు' విశేష స్పందన

ప్రజాశక్తి-విడవలూరు

ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన వస్తుందని ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విడవలూరు మండల పరిధిలోని మన్మధరావుపేట, జాన్‌పేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి గడపకు వెళ్లి ఇంట్లో వారిని పలకరిస్తూ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా వారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పవన్‌కళ్యాణ్ వైసిపి ఎంఎల్‌ఎలపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడుతున్నారని తెలిపారు. రెండు నియోజక వర్గాల్లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి పవన్ కళ్యాణ్



అని పార్టీ పేరు గానీ తెలియని వ్యక్తి వైసిపి ప్రభుత్వం గురించి మాట్లాడటం సరికాదన్నారు. తల.. తోకా.. లేకుండా మాట్లాడే వ్యక్తిని ఎర్రగడ్డలో చేర్పించాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి, నల్లపరెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ పుండ్ల అచ్యుత్ రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు కొండూరు వెంకట సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించకుంటే ఉద్యమం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య హెచ్చరించారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతో పాటు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనను విరామించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్, ట్రూఅప్, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అధిక భారం మోపుతోందని విమర్శించారు. కేవలం రెండు రూపాయలకే యూనిట్ విద్యుతు వస్తున్న నేపథ్యంలో కరెంటు



ఛార్జీలు తగ్గించవలసింది పోయి అందుకు భిన్నంగా అదనపు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ఆదానీకి అప్పజెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. తమ డిమాండ్లను అంగీకారించక పోతే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాల్తిరెడ్డి రమణమ్మ, బండి శౌరి, తోట క్రిష్ణయ్య, మోచర్ల రాధయ్య, తదితరులున్నారు.


మాట్లాడతున్న మాలేపాటి సుబ్బానాయుడు

పార్టీ కోసం పనిచేసే వారికే గుర్తింపు

ప్రజాశక్తి-కావలి

తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే వారికి తన వద్ద తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆధ్వర్యంలో కావలి పట్టణ, రూరల్ మండల పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 27వ తేదీన కావలిలో జరగనున్న టిడిపి "పల్లె నిద్ర" (బస్సు యాత్ర) కార్యక్రమ వివరాలను పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల మేరకు నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో శ్రేణులు విరివిగా పాల్గొని ప్రతి ఒక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా 27వ తేదీన జరిగే "పల్లెనిద్ర" (బస్సు యాత్ర) కార్యక్రమానికి, తదనంతరం జరిగే లోకేష్ యువగళం పాదయాత్రకి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని దిగ్విజయం చేయాల్సిందిగా ప్రతి ఒక్కరిని కోరుతున్నామన్నారు.



గేదెల యజమానులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలో ఇటీవల నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా పిఎన్‌పల్లి అనంతపురం వద్ద విడిది ప్రదేశంలో పడేసిన ఆహారం తిని వనం తిరిపాలు, మరో ఇద్దరికి చెందిన గేదెలు మృతి చెందాయి. గేదెలు మృతి చెందిన విషయాన్ని ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డికి తెలియజేయగా స్పందించిన ఆయన ఇద్దరికీ నష్టపరిహారం చెల్లించారు. మరో బాధితుడు తిరుపాలకు మండల టిడిపి మాజీ కన్వీనర్ శాఖమూరి నారాయణ రూ.25వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు.


తహశీల్దారు జగదీష్

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలో తహశీల్దార్ వి.జగదీష్ బాబుతో పాటు పలు శాఖల అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జగదీష్ బాబు బాధ్యతలు చేపట్టి ఆయన మాట్లాడారున. ముత్తుకూరు మండలంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తు పదోన్నతి పొందడంతో మండల తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టామన్నారు. మండల ప్రజలకు రైతులకు అందుబాటులో ఉండి ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో తహశీల్దారుగా విధులు నిర్వహించిన సానా శ్రీనివాసులు రెడ్డి బదిలీపై ప్రకాశం జిల్లా మార్కాపురం వెళ్లారన్నారు. మండల ఇరిగేషన్ ఏఈగా చంద్రమౌళి మండల వ్యవసాయ అధికారి గా ఏ.ఆంజనేయ నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

భారీగా తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి-మర్రిపాడు

ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో ఎంజిఆర్ ఫౌండేషన్ స్వంత నిధులతో నిర్మించిన మున్సిపల్ బస్టాండ్ ప్రారంభోత్సవానికి పల్లవోలు నుండి గంగినేని రవీంద్రబాబు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి, వైసిపి మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అస్తవ్యస్తంగా ఉన్న బస్టాండ్‌ను ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎంజిఆర్ ఫౌండేషన్ తరపున రూ.4.50లతో సుందరంగా నిర్మించారని తెలిపారు. 2024 ఎన్నికలలో విక్రమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

ప్రజాశక్తి-సంగం : ఆత్మకూరులో జరిగే మాజీమంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి నూతన బస్టాండ్ ప్రారంభ కార్యక్రమానికి సంగం మండలం నుండి వైసిపి నేత రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. సంగం ఇరిగేషన్ గెస్ట్ హౌస్ ప్రాంతం నుండి అధిక సంఖ్యలో వాహన ర్యాలీతో నాయకులు, కార్యకర్తలు



ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలతో బయల్దేరి వెళ్లారు. నాయకులు మాట్లాడుతూ తమ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేసి సొంత నిధులతో అధునాతన హంగులతో బస్టాండ్ నిర్మించడం అభినందనీయమన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో సైతం తమ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు.

కుష్టు నివారణకు అవగాహన

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తించడం వల్ల పూర్తిగా నివారించవచ్చని లెప్రసి నోడల్ ఆఫీసర్ నరసారెడ్డి స్పష్టం చేశారు. పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒంటిపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలుంటే కుష్టు లక్షణాలుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా ముఖంపై బొబ్బర్లు ఉన్నా కుష్టు లక్షణాలుగా పరిగణించి పిహెచ్‌సిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎవ్వరికైనా కుష్టు లక్షణాలున్నట్లు అనుమానం ఉంటే వెంటనే వారిని పిహెచ్‌సికి తీసుకొచ్చి పరీక్షలు చేయించి నిర్ధారించుకోవాలని తెలిపారు. వ్యాధి ముదరడం వల్ల నివారణ కష్టతరంగా మారడంతోపాటు కాల వ్యవధి పట్టే అవకాశం ఉందన్నారు. అందువల్ల గ్రామాల్లో పర్యటించే వైద్య సిబ్బంది ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే పిహెచ్‌సిలో పరీక్ష చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాల చంద్రబాబు, సిహెచ్ సోమశేఖర్ హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఎ షఫీ ఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.